ప్రజాశక్తి

గురువారం 14 సెప్టెంబర్ 2023 5

పార్వతీపురం మన్యం

15న ఇంజినీర్స్ డే

ప్రజాశక్తి-పార్వతీపురం

భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఈ నెల 15న ఇంజినీర్స్‌డేను పంచాయతీరాజ్ ఇంజినీర్స్ ఫోరం నిర్వహిస్తోంది. ఇంజినీర్స్ డే సందర్భంగా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని, ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభిస్తారని ఫోరం ప్రతినిధులు బి.లక్ష్మణరావు, రత్నాకర్ బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయం వద్ద నెలకొల్పిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆవిష్కరిస్తారని చెప్పారు. ఇంజినీరింగ్ అధికారులు పాల్గొంటారని, అన్ని శాఖల ఇంజినీర్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్రంలో అరాచక పాలన

టిడిపి పాలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి • చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా రిలే దీక్షలు



సాలూరులో దీక్షలు చేస్తున్న టిడిపి నాయకులు జి.సంధ్యారాణి, ఆర్‌పి భంజ్‌దేవ్, తదితరులు

ప్రజాశక్తి-సాలూరు

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్‌పి భంజ్‌దేవ్ ధ్వజమెత్తారు. టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా బుధవారం జిల్లాలో పలు చోట్ల టిడిపి ఆధ్వర్యాన రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సాలూరు పట్టణంలోని బోసుబొమ్మ జంక్షన్‌లో రిలే దీక్షలు చేపట్టారు. చంద్రబాబు అరెస్టుకి నిరసనగా పురోహితునివలస గ్రామానికి చెందిన టిడిపి నాయకులు తురాయిల సత్యం గుండు గీయించుకున్నారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ 14 ఏళ్ల సిఎంగా పనిచేసిన చంద్రబాబునాయుడు అవినీతి మచ్చలేని నాయకుడిగా ప్రజల మన్ననలు పొందారని అన్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే చంద్రబాబును సిఎం జగన్ మోహన్ రెడ్డి అరెస్టు చేయించారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల అధ్యక్షులు ఆముదాల పరమేష్, పిన్నింటి ప్రసాద్‌బాబు, జి.వేణుగోపాల్, నాయకులు సిహెచ్.తవిటినాయుడు, మాజీ కౌన్సిలర్ ఎ.అప్పయ్యమ్మ పాల్గొన్నారు. **కురుపాం**లో టిడిపి కార్యాలయం వద్ద గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దత్తి లక్ష్మణరావు, టిడిపి సీనియర్ నాయకులు ద్వారపురెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బండి రాజు, బిడ్డిక పద్మావతి, తాడంగి రామారావు, చందక రామకృష్ణ, కొండలరావు, మంజువాణి తదితరులు పాల్గొన్నారు. **కొమరాడ** మండల కేంద్రంలో టిడిపి ఆధ్వర్యాన రెండో రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఎస్‌టి సెల్ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బిడ్డక తమ్మయ్య ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. దీక్షలకు జనసేన నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎం.వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు. **గుమ్మలక్ష్మీపురం** మండల కేంద్రంలో చేపట్టిన రిలే దీక్షలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. చంద్రబాబును విడుదల చేసే వరకూ పోరాటం కొనసాగిస్తామని ఆమె స్పష్టంచేశారు. **పాలకొండ రూరల్** కోటదుర్గమ్మ ఆలయ సమీపంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. **సీతంపేట** మండలంలో టిడిపి నియోజకవర్గ నాయకులు పడాల భూదేవి తన క్యాంపు కార్యాలయంలో మండల నాయకులతో సమావేశమ య్యారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడును అన్యాయంగా కేసుల్లో ఇరికించి రిమాండ్‌కు పంపించిన తీరును ప్రజల్లోకి తీసుకెళ్ళాలని నాయకులకు భూదేవి సూచించారు. సమావేశంలో మాజీ ఎంపిపిలు ఆరిక లచ్చుమయ్య, సవర కుంపి, సీనియర్ నాయకులు సవర సూర్యారావు, సవర గంగయ్య, సవర మల్లేశ్వరరావు, సవర రాము, సవర మంగయ్య, సవర మాసయ్య, తదితరులు పాల్గొన్నారు.

దీక్షలు భగ్నం

పార్వతీపురం రూరల్ : టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా ఆ పార్టీ నాయకులు స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలిలో బుధవారం చేపట్టిన రిలే నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. పట్టణ సిఐ కృష్ణారావు పోలీసు సిబ్బందితో శిబిరం వద్దకు చేరుకొని, అనుమతులు లేవని అడ్డుకొన్నారు. పోలీసుల చర్యలపై నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ తరుణంలో 12 మంది నాయకులను బలవంతంగా వాహనాల్లో ఎక్కించి గరుగుబిల్లి స్టేషన్‌కు తరలించారు. సొంత పూచీకత్తుపై సాయంత్రం వారిని విడుదల చేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకట్ నాయుడు, పట్టణ అధ్యక్షులు జి.రవికుమార్, బోను చంద్రమౌళి, బార్నాల సీతారాం, బడే గౌరినాయుడు, తాతపూడి వెంకటరావు, కె.నారాయణరావు, కోల మధుసూదన్‌రావు, సరిత పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్..మాజీ ఎమ్మెల్యే చిరంజీవులును అరెస్టు చేస్తున్న పోలీసులు

పాలకొండ, కురుపాంలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ నిశాంత్, జెసి గోవిందరావు, ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి-పార్వతీపురం

ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కలెక్టర్లతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో లేరని, ఇతర ప్రాంతాల నుండి అనుసంధానం చేయాలని కలెక్టర్ కోరారు. దీనిపై వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు స్పందిస్తూ ఇప్పటికే స్పెషలిస్ట్ వైద్యులను అనుసంధానం చేశామన్నారు. సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజల్లోకి ఇప్పటికే చేరిందని, మరింత అవగాహన కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తిస్తామన్నారు. వాలంటీర్లు ముందుగా ఈ నెల 15 నుంచి ఇంటింటికీ వెళతారని, తరువాత రోజు ఎఎన్ఎం, ఆశాల బృందం వెళ్లి పరీక్షలు నిర్వహించి, కేస్ షీట్ తయారు చేస్తారని చెప్పారు. వైద్య శిబిరాల షెడ్యూల్ ముందుగా తెలియజేస్తామన్నారు. ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం ఆరోగ్య బాధ్యత ఇందులో ఇమిడి ఉందని, దీనిని ప్రతిష్టాత్మకంగా ప్రాధాన్యతతో చేపడతామని ఆయన తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతోపాటు ఆరోగ్యశ్రీ ఉపయోగించుకునే విధానంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, డిఎంహెచ్ఒ బగాది జగన్నాథరావు, డిసిహెచ్ఎస్ బి.వాగ్దేవి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్, ఐసిడిఎస్ పీడీ కె.విజయగౌరి, మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, జగనన్న ఆరోగ్య సురక్ష ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి ఏనుగు బీభత్సం

రైల్వే గేటు ధ్వంసం

ప్రజాశక్తి-కొమరాడ

మరోమారు ఒంటరి ఏనుగు హరి మండలంలో బీభత్సం సృష్టించింది. బుధవారం తెల్లవారు జామున మండలంలోని విక్రమపురం సమీపంలోని రైల్వే ట్రాక్ వద్దకు వచ్చి ఏనుగు హల్‌చల్ చేసింది. రైల్వే గేటును ధ్వంసం చేసింది. దీంతో సమీపంలో ఉన్న ప్రజలు తీవ్ర భయాందోళన చెందారు. కొద్ది రోజుల క్రితమే అంతర్రాష్ట్ర రహదారిలో ప్రయివేటు బస్సుపై ఒంటరి ఏనుగు దాడి చేసిన విషయం తెలిసిందే. ఏనుగుల గుంపు నుంచి ఒంటరి ఏనుగు హరి విడిపోయి సుమారు నెలరోజులు కాబోతున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఒంటరి ఏనుగు సంచారం పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు.

ఏనుగుదాడిలో ధ్వంసమైన గేటు

ఏరియా ఆస్పత్రిలో నూతన బ్లాక్ ప్రారంభం

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఏరియా ఆస్పత్రి 30 పడకల నుండి 100 పడకల వరకు అప్‌గ్రేడ్ అయింది. ఈ నేపథ్యంలో నూతన కొన్ని బ్లాకుల నిర్మాణాలు పూర్తి కావడంతో సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు నూతన బ్లాక్‌ను బుధవారం ప్రారంభించారు. వీటిలో దీర్ఘకాలిక వ్యాధుల చికిత్స విభాగం గది, మిగతా గదులు కూడా వైద్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులకు, రోగులకు ప్రత్యేకమైన గదులు ఉండటంతో వైద్యం సకాలంలో అందించడానికి వీలుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వెంకట్రావు, రాజేష్, గౌరీశంకర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

పనులు వేగవంతం

ఇంజినీరింగ్ అధికారులకు ఐటిడిఎ పిఒ కల్పనకుమారి ఆదేశం

ప్రజాశక్తి-సీతంపేట

ఇంజినీరింగ్ పనులను వేగవంతం చేయాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. బుధవారం పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్, ఎపిఇపిడిసిఎల్, హౌసింగ్, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం పనులను పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో క్లోరినేషన్ క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. గిరిజన గ్రామాలకు తాగునీరు సౌకర్యం కల్పించాలని అన్నారు. హౌసింగ్ లేఅవుట్లకు నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. టూరిజం ప్రాజెక్టులు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఇఇ రాధారాణి, టిడబ్ల్యు ఇఇ సింహాచలం, పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇలు కృష్ణకుమార్, ఢిల్లీశ్వరరావు, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్‌కు ప్రతిపాదనలు

ప్రజాశక్తి-పార్వతీపురం

పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ కోసం ఈ నెల 23 తేదికి ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు పునశ్చరణ కార్యక్రమం, పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 3170 వివి ప్యాట్లు కేటాయించారని, ఇప్పటికే 2170 అందాయని తెలిపారు. బెంగళూరు బిఇఎల్ నుండి వచ్చిన వివి ప్యాట్లను రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో స్వీకరించినట్లు తెలిపారు. కొత్త ఇవిఎం మిషన్ స్కానింగ్ గురు, శుక్రవారాల్లో జరుగుతుందన్నారు. ఈ నెల 20న నుంచి ఇవిఎంలను పరీక్షిస్తామని, సంబంధిత రాజకీయ పార్టీల ప్రతినిధులంతా సహకరించాలని కోరారు. అక్టోబర్ ఒకటో తేది నుంచి ఇవిఎంలు, వివి ప్యాట్లు మొదటి స్థాయి తనిఖీ చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో తొలగించిన ప్రతి ఓటూ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో అన్ని రకాల ఫారాలకు సంబంధించి మొత్తం దరఖాస్తులు 1,07,533 అందాయన్నారు. అందులో పాలకొండ నియోజక వర్గంలో 37386, కురుపాం నియోజకవర్గంలో 30738, పార్వతీపురం నియోజకవర్గంలో 16387, సాలూరు నియోజకవర్గంలో 23022 ఉన్నాయని చెప్పారు. ఇందులో 1445 తిరస్కరించగా, 3115 అంగీకరించామని, 64,365 ఓటరు జాబితాలో

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

చేర్చామని, 38608 పెండింగ్‌లో ఉన్నాయని ఆయన వివరించారు. ఫారం-6 కింద 19,081 దరఖాస్తులు అందగా పాలకొండ నియోజకవర్గంలో 6451, కురుపాం నియోజకవర్గంలో 5979, పార్వతీపురం నియోజకవర్గంలో 2945, సాలూరు నియోజకవర్గంలో 3706 ఉన్నాయని చెప్పారు. ఫారం-7 ద్వారా 22,867 దరఖాస్తులు అందాయన్నారు. పాలకొండ నియోజకవర్గంలో 10703, కురుపాం నియోజకవర్గంలో 4980, పార్వతీపురం నియోజకవర్గంలో 3516, సాలూరు నియోజకవర్గంలో 3668 ఉన్నాయని చెప్పారు. ఓటరు జాబితాలో దిద్దుబాటు కోసం ఫారం-8 కింద 65,585 దరఖాస్తులు అందాయన్నారు. పాలకొండ నియోజకవర్గంలో 20,232, కురుపాం నియోజకవర్గంలో 19,779, పార్వతీపురం నియోజకవర్గంలో 9926, సాలూరు నియోజకవర్గంలో 15,648 ఉన్నాయని చెప్పారు. ఏప్రిల్ 15 నుండి సెప్టెంబర్ 12 వరకు 9700 ఓట్లు చేర్చగా పాలకొండ నియోజకవర్గంలో 4003, కురుపాం నియోజకవర్గంలో 2013, పార్వతీపురం నియోజకవర్గంలో 447, సాలూరు నియోజక వర్గంలో 3237 ఉన్నాయని వివరించారు. 7651 ఓట్లు తొలగించామన్నారు. అందులో పాలకొండ నియోజకవర్గంలో 4490, కురుపాం నియోజక వర్గంలో 1393, పార్వతీపురం నియోజక వర్గంలో 113, సాలూరు నియోజకవర్గంలో 1655 ఉన్నాయని చెప్పారు. 47,014 ఓటర్లకు చేర్పులు, మార్పులు చేసినట్లు తెలిపారు. పాలకొండ నియోజక వర్గంలో 15,032, కురుపాం నియోజకవర్గంలో 14,616, పార్వతీపురం నియోజకవర్గంలో 4872, సాలూరు నియోజకవర్గంలో 12,494 ఉన్నాయని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జె.వెంకటరావు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ డి.రవికుమార్, సిపిఐ ప్రతినిధి కె.మన్మథరావు, సిపిఎం ప్రతినిధి పి.రాజశేఖర్, కాంగ్రెస్ ప్రతినిధి జె.భాస్కరరావు, టిడిపి ప్రతినిధి బి.డి చంద్రమౌళి, జనసేన పార్టీ ప్రతినిధి పైల శ్రీనివాసరావు, బిజెపి ప్రతినిధి పారిశర్ల అప్పారావు, బిఎస్‌పి ప్రతినిధి టి.వెంకటరమణ, లోక్‌సత్తా పార్టీ ప్రతినిధి కె.పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎన్.నారాయణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యాటక రంగంలో విశిష్ట సేవలు అందించిన వారికి పోటీలు నిర్వహించి అవార్డులను ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ఔత్సాహికులు www.tourisam.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో సమర్పించాలని కోరారు. ఎంపిక చేసిన వారికి పర్యాటక దినోత్సవం సందర్భంగా అవార్డులు అందిస్తారని వివరించారు.

15న ఉద్యోగుల గ్రీవెన్స్

ప్రజాశక్తి-పార్వతీపురం

ఉద్యోగుల గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులు వ్యక్తిగత ఫిర్యాదులతో సహా ఏ రకమైన ఫిర్యాదులనైనా సమర్పించవచ్చని తెలిపారు. ఫిర్యాదులను జగనన్నకు చెబుదాం పోర్టల్లో ప్రత్యేక ఐడిలతో నమోదు చేయనున్నట్లు వెల్లడించారు.

ముఖ్యమంత్రి పర్యటన ఖరారు

వైద్య కళాశాల ప్రారంభానికి ముమ్మరంగా ఏర్పాట్లు

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జిల్లాకు రాక ఖరారైంది. ఈ విషయాన్ని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వెల్లడించారు. ముఖ్యమంత్రి ఈనెల 15న ఉదయం 10.30 గంటలకు హెలికాప్టర్‌లో జెఎన్‌టియు సమీపంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారని, 10.45 గంటలకు వైద్య కళాశాల ప్రాంగణానికి చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. అనంతరం వైద్య కళాశాల ప్రారంభానికి సంబంధించిన శిలాఫలకం ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్, స్కిల్ ల్యాబ్‌లను సందర్శిస్తారని తెలిపారు. అనంతరం బయోకెమిస్ట్రీ ల్యాబ్, అనాటమీ మ్యూజియం పరిశీలిస్తారని పేర్కొన్నారు. 11.30 గంటలకు లెక్చర్ హాలుకు చేరుకొని రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఐదు ప్రభుత్వ వైద్యకళాశాలల్ని వర్చువల్‌గా ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు సందేశాలు ఇస్తారని, అనంతరం ఐదు కళాశాలల వైద్య విద్యార్థులతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడతారని తెలిపారు. అనంతరం హెలిపాడ్‌కు చేరుకొని జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో సమావేశం అవుతారని పేర్కొన్నారు. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పి ఎం.దీపిక, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌లు ఏర్పాట్లను పరిశీలించి ఆయా వేదికలకు ఇన్‌ఛార్జిలుగా వ్యవహరిస్తున్న అధికారులకు సూచనలు చేశారు. ల్యాబ్‌లను సంబంధింత పరికరాలు, ప్రదర్శన అంశాలతో సిద్ధంచేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డా.పద్మలీలను ఆదేశించారు. లెక్చర్ హాలులో ప్రధాన కార్యక్రమ వేదిక వద్ద వీడియో కాన్ఫరెన్సింగ్, ప్రత్యక్ష ప్రసారం, తదితర ఏర్పాట్లపై సూచనలు చేశారు. వైద్య మౌళిక సదుపాయాల సంస్థ అధికారులు ఎస్.ఇ. శివకుమార్, ఇఇ బి.ఎన్.ప్రసాద్ తదితరులు కళాశాల ప్రాంగణంలో చేస్తున్న ఏర్పాట్లపై వివరించారు. ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, కార్పొరేషన్ కమిషనర్ శ్రీరాములు నాయుడు, ఎస్.డి.సి. సూర్యనారాయణ, తహశీల్దార్ కె.శ్రీనివాసరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న విజయనగరం కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పి దీపిక

ఆ స్కూల్‌తో నాకేం పని?

- ఎంఇఒ వితండవాదం
- డిఇఒ పరిధిలో ఉందంటూ శివాలు

ప్రజాశక్తి-గరుగుబిల్లి

మండల పరిధిలోని పాఠశాలలు ఎంఇఒ పర్యవేక్షణలో ఉంటాయి. ఈ విషయం అందరికీ తెలిసిందే. గరుగుబిల్లి ఎంఇఒ మాత్రం అందుకు విరుద్ధంగా వాదిస్తున్నారు. మండలంలో స్కూళ్లు తన పరిధిలో ఉండవంటున్నారు. డిఇఒదే బాధ్యత సెలవిస్తున్నారు. ఇదే విషయం డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా, అదేం కాదు, ఎంఇఒ పర్యవేక్షించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

నెల క్రితం నాగూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రహరీ కూలిపోయింది. దీనిపై ఈ నెల ఏడో తేదీన 'ప్రజాశక్తి' దినపత్రికలో 'విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం' అనే కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ప్రహరీ కూలడం వల్ల పాఠశాలలోకి విషజంతువులు, కుక్కల గుంపులు వచ్చే ప్రమాదముందని, ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవడం ద్వారా విద్యార్థుల ప్రాణాలు కాపాడొచ్చని దాని సారాంశం. ఈ కథనం చూసిన ఎంఇఒ నాగభూషణరావుకు చిర్రెత్తికొచ్చింది. ప్రజాశక్తి ప్రతినిధికి ఫోన్ చేసి, ఆ స్కూల్ తన పరిధిలో ఉండదని, డిఇఒ పరిధిలోకి వస్తుందని సెలవిచ్చారు. 'ముందకేం చూశావ్? వెనుక ఉన్న ప్రవారీ మొత్తం కూలిపోయింద'ంటూ ఆవేశంతో ఊగిపోయారు. మండలంలో స్కూళ్లు ఎంఇఒ పరిధిలో ఉంటాయి కదా? అని ప్రశ్నించగా, సబ్జెక్టు తెలుసుకుని మాట్లాడండంటూ ఎంఇఒ దబాయించడం గమనార్హం.

పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఇఒ నాగభూషణరావు

ఎంఇఒ పరిధిలోనే..

ఇదే విషయమై డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్‌ను సంప్రదించగా, మండలంలో ఉన్న పాఠశాలలన్నీ ఎంఇఒ పరిధిలో వస్తాయని ఆయన తెలిపారు. ఆయా పాఠశాలల్లో ఏమైనా సమస్యలున్నాయని తమ దృష్టికి తీసుకొస్తే, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

జెఎస్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిఎంహెచ్‌ఒ బగాది జగన్నాథ రావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిక్షణలో భాగంగా పార్వతీపురం మండలం పెదబొండపల్లిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేద ప్రజలందరికీ ఆరోగ్య భరోసా దక్కుతుందని చెప్పారు. 105 రకాల మందులు, 14 రకాల డయాగ్నస్టిక్స్ ఉంటాయని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య అవసరాలను గుర్తించడం, అవసరమైన వారికి గ్రామాల్లోనే ఆరోగ్య శిబిరాలు నిర్వహించి వైద్యం అందించడం, పెద్ద ఆస్పత్రులకు సిఫార్సు చేయడం లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని రూపకల్పన చేశారని వెల్లడించారు. నెల రోజులపాటు ప్రతి రోజూ వైద్య శిబిరాలు జరుగుతాయన్నారు. **పార్వతీపురం టౌన్ ..** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై మున్సిపల్ కార్యాలయంలో డిఎంహెచ్‌ఒ బి.జగన్నాథరావు అవగాహన

పార్వతీపురంటౌన్.. మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ జగన్నాథరావు

కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న పట్టణంలో జగన్నాథపురంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో జెఎఎస్ శిబిరాలు ప్రారంభం అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్. మురళి, తదితరులు పాల్గొన్నారు. **పాచిపెంట..** ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎంపిపి, పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ బడ్డాన ప్రమీల అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విధి, విధానాలపై పిహెచ్‌సి వైద్య అధికారులు, ఎఎన్ఎం, ఆశాలు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ నెల 30 నుంచి సచివాలయాల వారీగా వైద్య శిబిరాలు నిర్వహించన్నట్లు ఆమె తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో విష జ్వరాలు విజృంభించే అవకాశం ఉందని, ప్రజారోగ్యం పట్ల ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. సమావేశంలో ఎంపిడిఒ జి.పార్వతి, వైద్యాధికారులు, ఎం.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు. **సీతానగరం..** ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి రామచంద్రరావు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు ముందుకు అవగాహన కలిగించాలన్నారు. సమావేశంలో డిఐఒ జగన్‌మోహన్‌రావు, ఎంపిడిఒ ఎంఎస్ఎల్ ప్రసాద్, వైద్యాధికారి కె శిరీష పాల్గొన్నారు. **కొమరాడ..** ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎంపిడిఒ మల్లికార్జునరావు అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వైద్య అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహశీల్దార్ సిహెచ్.రాధాకృష్ణ, ఎంఇఒ జామి నారాయణస్వామి, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. **గరుగుబిల్లి...** జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపిడిఒ పైడితల్లి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్షపై గ్రామపంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సాగర్‌వర్మ, కె.కార్తీక్, తహశీల్దార్ గేదెల వెంకట జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట.. మాట్లాడుతున్న ఎంపిపి ప్రమీల

సీతానగరం.. మాట్లాడుతున్న డ్వామా పీడీ రామచంద్రరావు

డిడిగా మంగవేణి

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్‌గా జి.మంగవేణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె సీతంపేట ఎటిడబ్ల్యుఒగా పనిచేస్తూ ఇన్‌ఛార్జి డిడిగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి డిడిగా వ్యవహరించిన శ్రీనివాసరావు మందస ఎటిడబ్ల్యుఒగా రీ బ్యాక్ అయ్యారు.

ఉమాకవి, దేవానంద్‌కు తానా ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

బాల కథానిలయం అధ్యక్షులు భోగెల ఉమామహేశ్వరరావు(ఉమాకవి), ఉపాధ్యక్షులు పాలక దేవానంద్‌కు తానా సభ్యులు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ నెల 9న తెలంగాణా మహాకవి కాళోజి నారాయణరావు జయంతి, తెలంగాణా భాషా దినోత్సవం సందర్భంగా తానా ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన కవిసమ్మేళనంలో వారు కవితలు చదివి వినిపించారు. దీంతో వారిని అభినందిస్తూ ప్రశంసా పత్రం అందించారు. దేవానంద్ గుమ్మలక్ష్మీ పురం ఎంపిపి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్నారు. తానా నుంచి ప్రశంసా పత్రం అందుకోవడంతో సాహితీవేత్తలు, కవులు ఉమాకవిని, దేవానంద్‌ను అభినందించారు.

'వైసిపిలో గ్రూపుల్లేవు'

ప్రజాశక్తి-కొమరాడ

మండలంలో వైసిపిలో గ్రూపు రాజకీయాలు లేవని, అంతా కలిసికట్టుగా ఉన్నామని వైసిపి మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్ధనరావు, సీనియర్ నాయకులు శెట్టి మధుసూదన్ రావు అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. వైసిపి బోలోపేతానికి ప్రతిఒక్కరూ కలిసికట్టుగా పనిచేస్తున్నారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను, నాయకులను అధిష్టానం ఎప్పుడూ గుర్తిస్తుందని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నవారు తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు.

పోలీసుల సేవాభావం

ప్రజాశక్తి-సీతానగరం

స్థానిక సువర్ణముఖి నది వంతెనపై ఏర్పడిన గోతులను ఎస్ఐ నీలకంఠం ఆధ్వర్యాన పోలీసు సిబ్బంది బుధవారం పూడ్చివేసి, సేవాభావాన్ని చాటుకున్నారు. 15 రోజుల క్రితమే గోతులను పూడ్చినప్పటికీ భారీ వాహనాలు రాకపోకలతో మళ్లీ గోతులు ఏర్పడ్డాయి. అయినా ఆర్‌అండ్‌బి అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో పోలీసులే ప్రత్యేకంగా దృష్టి పెట్టి గోతులను పూడ్చడంతో వాహనదారులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

తోటపల్లి వెంకన్నకు భారీ విరాళం

ప్రజాశక్తి -గరుగుబిల్లి

చిన్నతిరుపతిగా పేరుగాంచిన తోటపల్లి వెంకటేశ్వర దేవస్థానానికి గాయత్రీ కళాశాల కరస్పాండెంట్ గొల్లు ఎరుకునాయుడు లక్షా నూట పదహారు రూపాయలు విరాళం అందించారు. ఈ మేరకు నగదును తోటపల్లి ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ డి.పారినాయుడు, ఆలయ అర్చకులు అప్పలాచార్యులు, కోశాధికారి తామాడ దుర్గారావుకు అందజేశారు. కార్యక్రమంలో ఆవాల కన్నయ్య, మార్కొండ పకీరునాయుడు, శంబంగి సత్యం, శ్రీనివాసరావు, శేఖర్ పాల్గొన్నారు.

ఎంఇఒకు ఘన సన్మానం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని కంబరవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి భామిని ఎంఇఒగా ఉద్యోగోన్నతిపై వెళ్లిన వి.భాస్కరరావును బుధవారం ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వై.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

15న జెఎఎస్‌పై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

ఈ నెల 15న ఎంపిడిఒ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వివి శివరామప్ప తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు డిపిఒ ఆధ్వర్యంలో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

పాఠశాలకు కుర్చీలు వితరణ

ప్రజాశక్తి-వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలకు బుధవారం 1982-83 బ్యాచ్ విద్యార్థులు పది కుర్చీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్రీధర్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.ఉమామహేశ్వరరావు, జి.శ్రీనివాసరావు, కె.రమేష్, పి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


కుర్చీలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

వరి తెగుళ్లపై అప్రమత్తం

ప్రజాశక్తి-సీతానగరం

వరి పంటలో వస్తున్న తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎఒ ఎస్.అవినాష్ అన్నారు. మండలంలోని కోటసీతారాంపురంలో బుధవారం వరి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటను ఆశిస్తున్న అగ్గి తెగులు నివారణ చర్యలను రైతులకు వివరించారు. **పాచిపెంట :** వరి పొలంలో నాట్లు వేసిన వెంటనే అజొల్లా చల్లితే యూరియా తయారీ కేంద్రంలా పనిచేస్తుందని ఎఒ కె.తిరుపతిరావు తెలిపారు. మండలంలోని కర్రివలసలో సిఆర్‌పి బాలకృష్ణ ఆధ్వర్యాన రైతులకు అజొల్లాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజొల్లా నత్రజనిని స్థిరీకరించి వరి వేరు వ్యవస్థ దగ్గర అందుబాటులోకి తీసుకు రావడమే కాకుండా భూమి మొత్తాన్ని కప్పి ఉంచడం వల్ల కలుపు పెరగకుండా చేస్తుందన్నారు. ప్రకృతి సేద్యంలో ఘన, ద్రవ జీవామృతాలతో పాటు అజొల్లాను తప్పనిసరిగా వినియోగించాలని, కలుపు నివారణకు ఇది ఒక చక్కటి మార్గమని తెలిపారు. అనంతరం ఐసిఆర్‌పి విజయ్, సురేష్ రైతులకు ఉచితంగా జిగురు అట్టలు పంపిణీ చేశారు. పక్షి స్థావరాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విఎఎ మోహన్‌కృష్ణ, ఐసిఆర్‌పి కుమార్ పాల్గొన్నారు.

పాచిపెంట.. జిగురు అట్టలు పంపిణీ చేస్తున్న ఎఒ తిరుపతిరావు

కురుపాం... లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్న సర్పంచ్ గోపాల్

పింఛను కానుకతో ఆర్థిక భరోసా

ప్రజాశక్తి - కురుపాం

వైఎస్ఆర్ పింఛను కానుకతో పేదలకు ఆర్థిక భరోసా లభిస్తుందని సర్పంచ్ ఆరిక గోపాల్ అన్నారు. బుధవారం మండలంలో గుమ్మ సచివాలయ పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పి.పాపారావు, సిబ్బంది, వాలంటీర్లు, పాల్గొన్నారు.

భామిని : బాలేరు పంచాయతీ పరిధిలో కొత్తగా మంజూరైన 23 పింఛన్లను లబ్ధిదారులకు ఎంపిటిసి కొత్తకోట చంద్రశేఖర్, వైసిపి నాయకులు ఎం.చలపతిరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సారా, మద్యం సీసాలు ధ్వంసం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 43 కేసుల్లో పట్టుబడిన 23 లీటర్ల సారాను, 100 మద్యం బాటిళ్లను బుధవారం డిఎస్‌పి మురళీధర్ పర్యవేక్షణలో సిఐ కృష్ణారావు ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. పట్టణ శివారులోని అడ్డాపుశిల పాతరోడ్డులో పోలీస్ సిబ్బందితో కలిసి ధ్వంసం చేశారు.

చినబోగిలిలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని చినబోగిలి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డిఐఒ టి.జగన్మోహనరావు తనిఖీ చేశారు. రికార్డులో నమోదు చేసిన రోగుల ఆరోగ్య తనిఖీ వివరాలు పరిశీలించారు. ఎంతమందికి రోగ నిర్ధారణ పరీక్షలు చేశారు, గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలోపు పిల్లలు ఎంతమంది ఉన్నారు, ఎంతమందికి ఆరోగ్య తనిఖీలు చేపట్టారు, తదితర అంశాలపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. వైద్య శిబిరం వద్ద మందులను, పరికరాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఉషారాణి, సూపర్ వైజర్ జయగౌడ్ , వైద్య సిబ్బంది విజయ, నవీన్ , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊసకొండలో ఫ్యామిలీ డాక్టర్

కురుపాం : మండలంలో ఊసకొండ గ్రామంలో 104 ఆధ్వర్యంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ అభినవ్ కుమార్ 72 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులకు వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం.. వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహనరావు

రైతులకు ఉపయోగపడేలా పనులు

ప్రజాశక్తి-వీరఘట్టం

చెరువుల పంట కాలువలు రైతులకు, చేపల పెంపకందారులకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే కళావతి అధికారులకు సూచించారు. బుధవారం ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యవసాయ పద్ధులకు సంబంధించి ఎఒ సౌజన్య మాట్లాడుతుండగా ఎమ్మెల్యే కలుగజేసుకున్నారు. వంద శాతం ధాన్యం పంట పండితే 20 శాతం తిండికి ఉంచుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. చలివేంద్రి -నర్సిపురం గ్రామాల మధ్య కల్వర్టు అధ్వానంగా ఉండటం వల్ల రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.జె.ప్రసాద్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కెఎల్ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

పక్కాగా ఓటరు జాబితా

ప్రజాశక్తి-పాచిపెంట

ఓటరు జాబితా పరిశీలన పూర్తి చేసి, పక్కాగా తయారు చేయాలని సాలూరు నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా పునశ్చరణపై పాచిపెంట తహశీల్దార్ కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. ఓటరు జాబితా పక్కాగా ఉండాలన్నారు. తొలగిస్తున్న ఓటరు వివరాలు ఆయా కుటుంబాలకు తెలియజేసి నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. పెండింగులో ఉన్న ఫారాలను తక్షణం పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆయన ఆదేశించారు. కొత్త ఓటర్ నమోదుకు సంబంధించి ఈ నెల 15 నాటికి పూర్తిచేసి 19 నాటికి ఎలక్షన్ కమిషనుకు పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక రామలీల డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శన ద్వారా వివరించారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు బాధితులను సురక్షిత ప్రదేశానికి తరలించే పద్ధతులు నేర్పారు.

రహా 'దారుణాలు'

జిల్లా వ్యాప్తంగా పలు మండల కేంద్రాలతో పాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు అధ్వాన్నంగా తయారయ్యాయి. దీంతో ప్రయాణం నరకయాతనగా మారిందని ప్రజలు వాపోతున్నారు. ప్రధాన రహదారులు సైతం గోతులుమయం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో రోడ్లపై పడిన గోతులు నీటితో నిండి ప్రమాదకరంగా మారాయి. మరమ్మతులకు గురైన రహదారులను బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నెల్లిమర్ల: మొయిద జంక్షన్ సమీపంలో రోడ్డుపై నిలిచిన వర్షంనీరు

అధ్వానంగా ప్రధాన రహదారులు

ప్రజాశక్తి – నెల్లిమర్ల

అర్‌అండ్‌బి అధికారుల నిర్లక్ష్యంతో రహదార్లు చెరువుల్లా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. నగర పంచాయతీ పరిధి మొయిద జంక్షన్ నుంచి జరజాపు పేట వెళ్లే రహదారిలో కల్వర్టు పూడుకు పోయి మురుగు నీరు రోడ్డు మీదకి వచ్చి వాహన దారులు, ప్రయాణీకులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని చెబుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో మరింత వర్షపు నీరు ఈ ప్రాంతంలో చెరువులా తలపిస్తుందని వాపోతున్నారు. కల్వర్టు వెడల్పు చేయడం ద్వారా పూడిక నివారించి నీరు నిల్వ లేకుండా చేయాలని కోరుతున్నారు. రామ తీర్థం గ్రామంలో నడిబొడ్డున ఇదే పరిస్థితి ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ గ్రామంలో మురుగు నీరు రహదారి పై ప్రవహించి గుంతలు పడి వాహన దార్లు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రహదార్లు, భవనాల శాఖ స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

వంగర: అరసాడ, నీలయ్యవలస మధ్య రోడ్డు పరిస్థితి..

వంగర: మండలంలోని ప్రధాన రహదారులన్నీ పూర్తిగా మరమ్మతులకు గురవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుండి రాజాం పట్టణానికి వెళ్లే ఆర్ అండ్ బి ప్రధాన రహదారి అరసాడ వరకు, అరసాడ నుండి నీలయ్య వలస వైపు వివిధ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి, వంగర నుండి శివ్వాం మీదుగా తలగాం, రుషింగి వైపు వెళ్లే ఆర్ అండ్ బి రహదారి, బంగారు వలస, కొండ చాకరాపల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారి, మడ్డువలస నుండి జగన్నాథ్ వలస మీదుగా నీలయ్య వలస వెళ్లే ప్రధాన రహదారి గోతులమయంగా ఉండడంతో ప్రజలు ప్రయాణించేటప్పుడు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు కూడా మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయాలలో అంబులెన్స్ కూడా ఈ రహదారుల మీదుగా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి రహదారుల పరిస్థితి పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతి నిధులు జోక్యం చేసుకొని రహదారులు బాగు చేయాలని కోరుతున్నారు.

నడక నరకయాతన

వేపాడ: మండలంలోని బొద్దాం జంక్షన్ నుండి ముకుందపురం వెళ్లే రోడ్డు, వేపాడు మీదుగా ఆనందపురం వెళ్లే రోడ్డు, వల్లంపూడి నుండి వేపాడ వరకు వెళ్లి రోడ్డు అధ్వాన్నంగా తయారయ్యాయి. గత రెండు రోజులుగా పడుతున్న వర్షానికి గుంతలలో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ఇప్పటికే పలుమార్లు ఈ సమస్యపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు.

వేపాడ, వల్లంపూడి రోడ్డుకు మధ్యలో ఏర్పడిన గొయ్యి

గోతులమయం.. పురిటిపెంట రహదారి

గజపతినగరం: నియోజకవర్గంలో మేజర్ పంచాయతీ అయిన పురిటిపెంట నుండి ఆంధ్ర వరకు సుమారు 15 కిలోమీటర్ల రహదారిని పూర్తిగా అధ్వాన్నంగా తయారైంది. పెద్ద పెద్ద లారీలు, వాహనాలు తిరగడంతో రోడ్లు చిధ్రమైపోయాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు నిల్వ ఉండడంతో కొన్నిచోట్ల రోడ్లు కుంగిపోవడం, మరికొన్నిచోట్ల పెద్దపెద్ద గుంతలుగా ఏర్పడడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు, నాయకులు స్పందించి తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గోతులమయమైన పురిటిపెంట రహదారి

బొబ్బిలి: బొబ్బిలి నియోజకవర్గంలో రోడ్లు అధ్వాన్నంగా మారాయి. పూల్‌బాగ్ రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు గోతులుమయంగా మారడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూల్‌బాగ్ రహదారిపై నుంచి బలిజిపేట, తెర్లాం, రాజాం, శ్రీకాకుళం ప్రాంతాలకు రాకపోకలు చేస్తుంటారు. ఈ రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వరదనీరు గోతులలో చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. రోడ్డు బాగు చేసేందుకు మున్సిపల్ సాధారణ నిధులు నుంచి రూ.40లక్షలు మంజూరు చేసి పనులు ప్రారంభించినా పూర్తి చేయలేదు. రైల్వే స్టేషన్ రోడ్డు మీదుగా రైల్వే వ్యాగన్ లారీలు వెళ్లడంతో రోడ్డు పాడైపోయింది. రోడ్డు పాడైపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లు బాగు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఇదీ పూల్ బాగ్ రోడ్డు పరిస్థితి